ప్రజాశక్తి
బుధవారం 29 నవంబరు 2023
5
శ్రీకాకుళం

టిడిపి హయాంలో డేటా చౌర్యం : వైసిపి

శ్రీకాకుళం : ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని టిడిపి నాయకుల వ్యాఖ్యలు దొంగే దొంగా.. దొంగా అన్నట్లు ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం, ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం టిడిపికి అలవాటు అని విమర్శించారు. 2017లో సేవా మిత్ర యాప్‌ను ఉపయోగించి టిడిపి, ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి లక్షల మంది ఓట్లను తొలగించి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని పేర్కొన్నారు. దానిపై ఎఫ్ఐఆర్ నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. తాజాగా ఆ పార్టీయే మరోసారి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తూ, మొబైల్‌కు వచ్చే ఓటిపిలను సైతం అడుగుతున్నారని తెలిపారు. ఇవ్వకపోతే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీ

జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ఓటర్ల జాబితా పరిశీలకులు జె.శ్యామలరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజు నుంచి ఇప్పటివరకు ఓటర్ల జాబితా సవరణలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలను నమోదు చేసుకుని, లిఖితపూర్వకంగా సమర్పించిన వినతులను తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, అత్యంత పారదర్శకంగా జాబితాలను తయారు చేస్తామని హామీనిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్యామలరావు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ చనిపోయిన వారి, డబుల్ ఎంట్రీల తొలగింపు చేపట్టాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు జాబితాలను తమకు అందజేయాలని కోరారు. బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సీనియర్ సిటిజన్లకు ఓటర్ల జాబితాలో ప్రత్యేక గుర్తింపు మార్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకరరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై తమకు ఎటువంటి అభ్యంతరాల్లేవన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సమన్వయంతో నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి వారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ, జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కాంగ్రెస్ నాయకులు గోవింద మల్లిబాబు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కలమట వెంకటరమణ, గుండ లక్ష్మీదేవి తదితరులు తమ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో సమస్యలను తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జయదేవి, శ్రీకాకుళం, పలాస ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ (నార్కో కోఆర్డినేషన్) సమావేశాన్ని నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, నియంత్రణ చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ అవగాహన లేకపోవడంతో మాదకద్రవ్యాలకు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాల వినియోగంపై కళాశాలల యాజమాన్యాలు దృష్టిసారించాలన్నారు. తల్లిదండ్రులకు పిల్లలపై నియంత్రణ లేక డ్రగ్స్, గంజాయి వంటి వాటికి బానిసలవుతున్నారని తెలిపారు. డ్రగ్స్ వినియోగంపై ఎలాంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

కమిటీ కన్వీనర్, ఎస్‌పి రాధిక మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యల్లో భాగంగా లాడ్జీలు, హోటళ్లలో బస చేసే కొత్త వ్యక్తుల వివరాల నమోదు కోసం లాడ్జి విజిటర్ మోనటరింగ్ సిస్టం అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దు కేంద్రాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, గత నెలలో ఇచ్ఛాపురం పరిధిలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గంజాయి తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు వివరించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమన్వయంతో 21 కేంద్రాల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జెడి ఎన్.మణికంఠ, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒలు, డిఇఒ వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ బి.మీనాక్షి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పి విజయ్‌కుమార్, సిఐలు పి.శ్రీనివాస్, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రశాంత ఎన్నికల నిర్వహణ లక్ష్యం

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘ మార్గదర్శకాలను సెక్టార్ అధికారులు తప్పక పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలకపాత్ర అని అన్నారు. ఎన్నికలకు నాలుగు నెలలు ముందుగా సెక్టార్ అధికారులను నియమించి, వారికి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘ మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. రిటర్నింగ్ అధికారులకు సెక్టార్ అధికారులు అనుసంధానమై ఉంటారని చెప్పారు. ఒక్కో రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని, ఒక్కో సెక్టార్ అధికారికి 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందన్నారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఇస్తామని తెలిపారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ స్వయంగా సందర్శించి వసతులు, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని, సమస్యాత్మక అంశాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పరిధిలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ పరిస్థితులు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. మాస్టర్ ట్రైనీ జయదేవి ఎన్నికల నిర్వహణ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సెక్టార్ అధికారుల అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం ఇవిఎంల ద్వారా ఓటింగ్ విధానాన్ని వివరించారు. శిక్షణా కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లాపరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, శ్రీకాకుళం, పలాస ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు ఎన్నికల విధుల కోసం నియమితులైన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిఎస్ఎన్ఎల్ పరిరక్షణతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ ఫోరం ఆఫ్ బిఎస్ఎన్ఎల్ అసోసియేషన్స్ పిలుపులో భాగంగా నగరంలోని సంచార్ భవన్ వద్ద ఆ సంస్థ ఉద్యోగులు మంగళవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ ఫోరం నాయకులు ఎం.గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేటు మొబైల్ సంస్థలకు ధీటుగా బిఎస్ఎన్ఎల్ 4జి, 5జి సేవలు దేశవ్యాప్తంగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌పై వివక్షను విడనాడి సంస్థను కాపాడాలని కోరారు. ఉద్యోగులకు 2017 జనవరి నుంచి రావాల్సిన వేతన సవరణ 15 శాతం ఫిట్‌మెంట్‌ను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాన్ ఎగ్జిక్యూటివ్ అధికారులతో సమానంగా ఐదేళ్లకోసారి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లక్ష్మి, అరుణ, అభిమన్యు, గోపాలరావు, పైల మల్లేశ్వరరావు, ఎం.వెంకటరావు, గోవిందరావు, పి.సూర్యం, దమయంతి, సుధ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి - ఆమదాలవలస

నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సన్నద్ధం కావాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాల్టీకి సంబంధించిన హౌసింగ్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తోందని చెప్పారు. సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రిని అందజేస్తోందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న గృహాలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ గణపతిరావు, డిఇఒ అప్పారావు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సర్పంచ్‌ల హక్కులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాలరాస్తున్నారని సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ విమర్శించారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతిరావు అధ్యక్షతన నియోజకవర్గ సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పంచాయతీల నిధులను దారిమళ్లిస్తూ గ్రామాల అభివృద్ధిని కుంటుపడేలా చేస్తోందని ధ్వజమెత్తారు. సర్పంచ్‌ల వ్యవస్థకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందని మండిపడ్డారు. సర్పంచ్‌కు నెలకు రూ.మూడు వేల గౌరవ వేతనం ఇస్తుంటే, వాలంటీరుకు రూ.ఐదు వేలు ఇస్తూ సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే నెల పదో తేదీన శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమావేశానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారని చెప్పారు. సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, మొదలవలస రమేష్, నూక రాజు, చింతాడ వాసుదేవరావు, పల్లి సురేష్, హనుమంతు బాలకృష్ణ, నియోజకవర్గంలోని సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం ఎన్నిక

ఆమదాలవలస నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఆమదాలవలస మండలం శ్రీనివాసచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఉపాధ్యక్షునిగా పొందూరు మండలం లైదాం సర్పంచ్ గొర్లె అనంతరావు, ప్రధాన కార్యదర్శిగా సరుబుజ్జిలి మండలం ఇసకలపాలెం సర్పంచ్ పల్లి సురేష్, కార్యదర్శిగా బూర్జ మండలం ఎపి పేట సర్పంచ్ కె.వెంకట శివరామరాజును ఎన్నుకున్నారు.

BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TEKKALI. O.S. 40/2020

Between:
BANK OF INDIA, TEKKALI BRANCH, Represented by it's Branch Manager, TEKKALI Village/Mandal in Srikakulam District. ...Plaintiff.
And:
Damera Kishore ...Defendant.

NOTICE TO THE SAID DEFENDANT

To, **Damera Kishore,** S/o Srinivasa Rao, Hindu, Door No: 3-190, Gittangi Village, Pathapatnam Mandal, Srikakulam District. Pin Code: 532203.

It is to inform you that the above said case/matter/suit i.e., O.S.40/2020 on the file of the Honourable Court of Junior Civil Judge, Tekkali in Srikakulam District is stands posted to dt: **29-11-2023** for your APPEARANCE, and you are to appear on the above said date before the said Honourable Court **at 10:30 AM,** in person or through your pleader/advocate, otherwise the above matter/case/suit will be decided against you. Hence, this notice.

//By order of the said Honourable Court//

KAJANA VENKATARAO,
Advocate for the Plaintiff,
TEKKALI,
Cell No: 9440196244, 6301366017.

IN THE HONORABLE COURT OF THE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
I.A.133/2019 in I.A.109/2019 in O.S. 67/2016

Between: **Izatuddin and others** --Petitioners/Plaintiffs
And: **Nadar Khan and others** --Respondents/1st defendants
To
R-15. Tadikamalla Poorna Chandra Sekhara Rao, S/o Koteswararao, Hindu, aged 65 years, resident of plot No.32, D.No. 16-14-55, backside road of S.E.T.Junior college, Gujarathipeta, Srikakulam.

వాది పై కోర్ట్ లో పై నెంబరు దావాను దాఖలు చేయగా సదరు **I.A.133/2019 in I.A.109/2019 in O.S. 67/2016** లో మీకు నోటీసు సర్వీస్ అమలు కానందున పై కోర్ట్ వారు మీ యొక్క హాజరు నిమిత్తం **తే. 30-11-2023 దీ కు** పై నెంబరు పిటిషన్స్‌లో వాయిదా వేసినారు. కావున పై తేది నాడు **ఉదయం 10-30 గం॥ లకు** పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలయపరుచు కొనవలెను. లేని యెడ మీ పరోక్షంగా తీర్మానించడమగునని ఇందుములముగ తెలియపరచడమైనది.

// By order of the said Honourable Court //

బరాటం నాగేశ్వరరావు
న్యాయవాది,
శ్రీకాకుళం. సెల్: 9391380645

ఓటర్ల జాబితాలో లోపాలు

కలెక్టర్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఓటర్ల ముసాయిదా ప్రకటించిన తర్వాత సవరణల్లో పెద్దఎత్తున లోపాలు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి ఇతర టిడిపి నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం నగరంలో మాజీ ఎమ్మెల్సీ మృతి చెందినా ఓటు హక్కు కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన నివాస్, ఆయన కుటుంబంలో నలుగురి ఓట్లు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటివి పెద్దఎత్తున ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ముసాయిదాలో ఉన్న పేర్లపై అభ్యంతరాలు తెలియజేసినా, ఇంతవరకు వాటిని సరిదిద్దలేదన్నారు. పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దకుండా ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని తెలిపారు. ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల్లో ఒడిశాలో నివాసముంటున్న వారిని ఓటర్లుగా చేర్చారని, వాటిని తొలగించాలని ఫిర్యాదులు ఇచ్చినా ఇంతవరకూ సవరించలేదన్నారు. లోపాలను సరిదిద్ది వాస్తవ జాబితాను రూపొందించాలని కోరారు.

9న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డిసెంబరు తొమ్మిదో తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థల అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో మోటారు వాహన ప్రమాదాల కేసుల్లోని పిటిషనర్లు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ బ్యాంకు ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహన ప్రమాద కేసులను ఎక్కువగా రాజీ చేయాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌లో మోటార్ ప్రమాద కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సత్వరమే పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, మోటారు వాహన ప్రమాద కేసుల్లోని పిటిషనరు తరపు న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

అరాచక ప్రభుత్వానికి ఆఖరి రోజులు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావు

ప్రజాశక్తి - లావేరు

ప్రజాకంటక వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని బెజ్జిపురం, బుడుమూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్ అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అథోగతిపాల్జేశారని విమర్శించారు. ఎమ్మెల్యే నుంచి మంత్రుల వరకు దేన్నీ వదలకుండా దోచుకున్నారని ఆరోపించారు. సంక్షేమం పేరిట ప్రజలపై అనేక రకాలుగా భారాలు మోపారని విమర్శించారు. అక్రమ ఆస్తులు కూడబెట్టుకుని 16 నెలలు జైల్లో ఉన్న జగన్, అక్రమ కేసులు పెట్టి చంద్రబాబు నాయుడును 53 రోజులు జైల్లో పెట్టారని తెలిపారు. వైసిపి నాయకుల మాయమాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని సాగనంపి, టిడిపికి పట్టం కట్టాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ప్రధాన కార్యదర్శి పి.మధు, ఎఎంసి మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, టిడిపి నాయకులు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళావెంకటరావు

BEFORE OF THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR/ DISTRICT REGISTRAR, SRIKAKULAM A.C.P.NO. 50/2023

Between:
M/S.MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, SRIKAKULAM Branch. --Disputant
And:
BASA SWATHI & 5 Others --Opponents
To:
OPP-1: Basa Swathi, W/o.Veeri Babu, R/at "O" Line, Chowdary Satyanarayana Colony, Gujarathipeta, Srikakulam Dist.
Opp-3: Basa Veeri Babu, S/o Ramappadu, R/at "O" Line, Chowdary Satyanarayana Colony, Gujarathipeta, Srikakulam Dist.

Please take notice that the above Dispute is Filed against Opp-1 and Five Others for Recovery of Rs. 47,487/- and the same is poested to **15-12-2023** for the appearance of you i.e.. Opponents No. 1 & 3 before the Deputy Registrar of Chits, Srikakulam **at 10-30 A.M.** if you fail to attend the Office of Deputy Registrar of Chits, Srikakulam on that day the matter will be heard and decided exparty basis on the material available.

(By Order of the Deputy Registrar of Chits)

PUDI RAMBABU
ADVOCATE FOR DISPUTANT
SRIKAKULAM.

BEFORE OF THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR/ DISTRICT REGISTRAR, SRIKAKULAM A.C.P.NO. 52/2023

Between:
M/S.MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, SRIKAKULAM Branch. --Disputant
And:
GEDELA KAMESWARA RAO & 4 Others --Opponents
To:
OPP-1: Gedela Kameswara Rao, S/o Pentaiah, w/as S.G.Teacher, MPE School, P.Jonnada (V), Seethampeta (M), Parvathipuram (Manyam) Dist.

Please take notice that the above Dispute is Filed against Opp-1 and Four Others for Recovery of Rs.3,15,574/- and the Same is posted to **15-12-2023** for the appearance of you i.e., Opponent No.1 before the Deputy Registrar of Chits, Srikakulam at **10-30 A.M.** if you fail to attend the Office of Deputy Registrar of Chits, Srikakulam on that day the matter will be heard and decided exparty basis on the material available.

(By Order of the Deputy Registrar of Chits)

PUDI RAMBABU
ADVOCATE FOR DISPUTANT
SRIKAKULAM.

BEFORE OF THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR/ DISTRICT REGISTRAR, SRIKAKULAM. A.C.P.NO. 54/2023

Between:
M/S.MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, SRIKAKULAM Branch. --Disputant
And:
YENUGUTALA GOPALA KRISHNA NAIDU & 3 Others --Opponents
To:
OPP-2: Sura Jayakrishna, S/o Adinarayana, w/as School Asst, Z.P.High School, Vangara (M), Vizianagaram Dist.,

Please take notice that the above Dispute is Filed against Opp-1 and Three Others for Recovery of Rs.6,91,386/- and the same is posted to **15-12-2023** for the appearance of you i.e.. Opponent No. 2 before the Deputy Registrar of Chits, Srikakulam **at 10-30 A.M.** if you fail to attend the Office of Deputy Registrar of Chits, Srikakulam on that day the matter will be heard and decided exparty basis on the material available.

(By Order of the Deputy Registrar of Chits)

PUDI RAMBABU
ADVOCATE FOR DISPUTANT
SRIKAKULAM.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM. S.O.P.15/2023.

Between: **LosuBhanu Prasad** ...Petitioner.
And:
The Branch Manager, Axis Bank, Narassannapeta Town, Narassannapeta Mandalam, Srikakulam District and another ...Respondents.

GENARAL NOTICE

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్ సక్షషన్ సర్టిఫికెట్ కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటీషన్లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥ 15-12-2023 ఉ॥ 10:30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను. లేనియడల మీ పరొక్షమందు తీర్మానించబడును.

PETITION SCHEDULE :

Item No: 1 Srikakulam District, Narasannapeta Mandalam, Narasannapta Town, AXIS Bank, Gold loan on the name of **Peyyala Bhulakshmi,** vide Account No: **9220600050730125,** Customer ID: 890403007, Type of Loan- LNAPG, dated 07-04-2022, which is in the custody of gold,details of gold

Sl.No	Ornament Details	No., of Ornaments	Gross weight (GMS)	Value of gold as on 17-11-2023.
01	Chain	2	39.320	2,35,330/- Rs.

The value of the petition schedule item No: 1 property is : **Rs. 2,35,330/-**

Item No: 2 Srikakulam District, Narasannapeta Mandalam, Narasannapta Town, AXIS Bank, Gold loan on the name of **Peyyala Bhulakshmi,** vide Loan Account No: **922060050800460,** Customer ID: 890403007, Type of Loan-LNAPG, dated 16-04-2022, which is in the custody of gold,details of gold

Sl.No	Ornament Details	No., of Ornaments	Gross weight (GMS)	Value of gold as on 17-11-2023.Rs.
01	Ring	1	5.920	35,431/-
02	Necklace Chains	1	15.580	93,246/-
03	Chain	1	15.040	90,014/-
04	Ear Ring	2	7.800	46,683/-
05	Total	5	44.340	2,65,374/-

The value of the petition schedule item No: 2 property is : **Rs. 2,65,374/-**
The value of the petition schedule item No: 1&2 propertys ar : Rs. 5,00,704/-

C. RAMA MOHAN
ADVOCATE, SRIKAKULAM, CELL: 94401 16221

పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన
శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని భగవాన్‌దాస్‌పేట, కేశవదాసుపురం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న నవరత్న పథకాలు తీరుతెన్నులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలు 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో పచ్చ చొక్కాలకే పరిమితమైన ప్రభుత్వ పథకాలు... జగనన్న వచ్చాక అర్హత ఉన్న లబ్ధిదారులకు రాజకీయాలకు అతీతంగా నేరుగా అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, సర్పంచ్‌లు మొకర శంకరరావు, మజ్జి శైలజ, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన సూరపనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రణస్థలం

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. రణస్థలంలోని సూర్య ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డాక్టర్ ఇడదాసుల యశ్వంత్ (చిన్నపిల్లలు మరియు జనరల్ వైద్యనిపుణులు), డాక్టర్ నూక ఆదిత్య శేఖర్ (ఎముకల వైద్యనిపుణులు), డాక్టర్ దయాకర్ (గుండె వైద్యనిపుణులు), డాక్టర్ ఇడదాసుల భాను పర్యవేక్షణలో 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయి కుమార్, జెడ్‌పిటిసి సీతారాం, వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, ఎంపిటిసి ప్రతినిధి పచిగుల్ల సాయిరాం పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పరిశీలన

మెళియాపుట్టి : మెళియాపుట్టి పోలీస్‌స్టేషను టెక్కలి డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. కేసు దర్యాప్తు వేగవంతం వివరాలు, అదృశ్యం డైరీలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఎస్ఐ టి.రాజేష్, ఎఎస్ఐలు నర్సింగరావు, అప్పన్న పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంత్రి తన క్యాంప్ క్యాంపు కార్యాలయంలో పూలే వర్ధంతిని పురస్కరించుకుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, ధనిక తరగతుల మధ్య అంతరాలు తగ్గించడానికి ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు.

కలెక్టరేట్‌లో...

కలెక్టరేట్‌లోని జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా అధికారులు ఆర్.గడ్డెమ్మ, ఇ. అనురాధ పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో పూలే చిత్రపటానికి టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, గాండ్ల, తెలికుల సాధికారిక సమితి రాష్ట్ర సభ్యులు కొమనాపల్లి వెంకట రామరాజు, తోట రాము పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన...

నగరంలోని పూలే పార్కులో పూలే చిత్రపటానికి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు పూలమాలలు వేశారు.

నందిగాం: వైసిపి మండల కార్యాలయంలో పూలే చిత్రపటానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, మండల జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, కవిటగ్రహారం, సైలాడ సర్పంచ్‌లు ప్రతినిధి బొమ్మాలి గున్నయ్య, సంభాన దానయ్య, ఎ.లోకనాథం, పేరాడ రమేష్‌కుమార్, అనిల్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి రూరల్ : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శ్రీనివాస్

టెక్కలి రూరల్: విద్యుత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంపతరావు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎకౌంట్ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక జైభీమ్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి జై భీమసేన జిల్లా అధ్యక్షుడు నగిరి మోహనరావు, సభ్యులు ఎం.సూర్యనారాయణ, డి.వెంకటరావు, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, హర్షవర్ధన్‌లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

భూ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మెళియాపుట్టిలోని కమలా కళ్యాణ మండపంలో జగనన్న వ్యవసాయ భూమి పట్టాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెసి ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమల్‌లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,100 మందికి 1,200 ఎకరాలను సంబంధించి భూ పట్టాలను అందజేశామని అన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 869 మందికి 450 ఎకరాలకు సంబంధించి పట్టాలను అందించామని తెలిపారు. జిల్లాలో మంజూరైన పట్టాలు సంబంధించి నియోజకవర్గంలోనే 40 శాతం పట్టాల పంపిణీ చేశామని తెలిపారు. మెళియాపుట్టి మండలానికి 241 మందికి గాను 134 ఎకరాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో

మెళియాపుట్టి : పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, జెసి, సబ్ కలెక్టర్

తహాశీల్దార్ పి.సరోజని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉల్లాన బాలరాజు, మాజీ ఎంపిపి మాడుగుల రామారావు, రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ ఎస్.సుభాష్ పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని బాతువలో ప్రభుత్వానికి సంబంధించిన సర్వే నంబర్ 95లో 12 మంది రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. పట్టాలు కావాలని ఇటీవల తహాశీల్దార్ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. తహాశీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పట్టాలను పంపిణీ చేశారు. మూడెకరాల సెంటు డీపట్టా భూమిని పంపిణీ చేశామని తహాశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజు, ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ పాల్గొన్నారు.

రణస్థలం : పేదల పక్ష పాతి సిఎం జగన్ అని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిల్లపేటరాజాం పంచాయతీలో పది మంది పేదలు సాగు చేసుకుంటున్న డీ పట్టా భూములకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, తహశీల్దార్ కిరణ్ కుమార్, సిగడాం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జి.సిగడాం తహాశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రానికి సిఎం శంకుస్థాపన

వర్చువల్ విధానంలో శంకుస్థాపనను తిలకిస్తున్న ఎమ్మెల్యే శాంతి

ప్రజాశక్తి - కొత్తూరు

తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఉప కేంద్ర నిర్మాణానికి రూ.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 132/11 ఉప కేంద్రం నిర్మాణానికి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యతక్ష వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప కేంద్రం నిర్మాణం పూర్తయితే హిరమండలం, సీతంపేట, భామిని, కొత్తూరు మండలాలకు నిరంతరం విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు. లోవోల్టేజీ సమస్యల ఉండదన్నారు. వ్యవసాయనికి పగటి పూట నిరంతరం 9 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే మెట్టూరు బిట్-2లో జగనే ఎందు రావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్, జెడ్‌పిటిసి కె.భాగ్యలక్ష్మి, ఎడి బి.రామ్మోహనరావు, పిఎసిఎస్ అధ్యక్షుతు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు పడల కృష్ణవేణి, కుంచాల రత్నాలు, వై.ధర్మారావు, వైసిపి నాయకులు ఎల్.తిరుపతిరావు, పంకజ్ దాస్ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుబ్బారావు

కలెక్టర్‌ను కలిసిన సుబ్బారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా బి.సుబ్బారావును ప్రభుత్వం ఇటీవల నియమించింది. గతంలో ఇక్కడ పని చేసిన అధికారిగా పలు ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయ్యారు. బాధ్యతలను స్వీకరణ అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను మర్యాదపూర్వకం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పిచ్చి కుక్క స్వైరవిహారం
20 మందికి గాయాలు

ప్రజాశక్తి - పొందూరు

మండల కేంద్రంలో మంగళవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తూ కనిపించినవారిపై దాడిచేసి కరవడంతో పలు గ్రామాలకు చెందిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడిలో పొందూరు, రాపాక, కొంచాడ, పలువురు స్కూల్ చిన్నారులపై దాడి చేసింది. ఈ పిచ్చికుక్క దాడితో 20 మందికిపైగా తీవ్రగాయాలయ్యాయి. వీరంతా ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ఇద్దరిపై దాడి చేసిన పిచ్చికుక్క అక్కడి నుంచి అఫీషియల్ కాలనీ మీదుగా కెవిఆర్ థియేటర్ సమీపంలో అప్పుడే పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థులపైనా దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. అక్కడి నుంచి ఎంపిడిఓ కార్యాలయం సమీపంలో కొంచాడ విఆర్ఎతో పాటు బైక్‌పై ఉన్న మరి కొందరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మళ్లీ అక్కడి నుంచి బస్టాండ్ వైపు వెళ్లిన పిచ్చికుక్క అక్కడ మరికొంత మందిపై దాడిచేసి గాయపరిచింది. కొంత మందికి లోతుగా గాయలు కావడంతో విలవిలలాడారు. స్వైరవిహారం చేస్తున్న కుక్కపై స్థానిక యువకులు కర్రలతో దాడి చేసి హతమార్చారు.

దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని రావాడలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు పూరిళ్ల దగ్ధ సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యవసర వస్తువులు, దుస్తులు, వంట సామగ్రిని బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, గొర్లె శ్రీనివాసరావు, లంక పాపారావు, లంక రాము, కిల్లారి సన్యాసినాయుడు, లంక రమణ, దన్నాన హరి, గొర్లె రవి, తాలాడ అప్పన్న, బోర సత్యం, బొంతు సూరి, సనపతి సత్యం పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల నిరసన

టెక్కలి రూరల్: విద్యాశాఖాధికారులు ఇచ్చిన ఛార్జీషీటులతో, మెమోలతో, షోకాజ్ నోటీసులతో భయపడేది లేదని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఆపస్, ఎపిటిఎఫ్ ప్రతినిధులు తమ్మినేని ఆనందరావు, నంబాల వాణిశ్రీ, శ్రీనివాస్, జీవానందం పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సర్పంచ్ శంకర్

సంత పరిసరాల అభివృద్ధికి కృషి

నరసన్నపేట: స్థానిక సంత పరిసరాలు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ బి.శంకర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సంత పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి సోమవారం జరిగే సంతకు నరసన్నపేట గ్రామస్తులే కాకుండా చుట్టు పక్కల నుంచి 35 గ్రామాల వర్తకులు, కొనుగోలుదారులు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రోడ్డుపై కాకుండా లైనులో షాపులు పెట్టి వ్యాపారం చేసుకోవడానికి వీలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, కార్యదర్శి సవర చిన్నారావు, ఎంపిటిసి నాగవంశం శ్రీనివాస్, వార్డు మెంబరు చీపురు నారాయణరావు పాల్గొన్నారు.

నేడు కోటబొమ్మాళి మండల సమావేశం

కోటబొమ్మాళి: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఓ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, వైఎస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ మెంబరు, మండల విప్‌లు పాల్గొవాలని కోరారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయించాలి

సోంపేట: సోంపేట పట్టణంలో జైభీమ్ సేన ఆధ్వర్యాన నిర్మించనున్న అంబేద్కర్ గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని సంస్థ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం జెడ్‌పిటిసి తడక యశోదకు సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, హర్ష తదితరులు వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయం ఏర్పాటుకు సోంపేట పట్టణంలోని బాలికోనత పాఠశాల పక్కన స్థలం కేటాయించాల్సిందిగా గతంలో అధికారులను, పాలకులను కోరామని తెలిపారు. అనంతరం పలాసపురం సర్పంచ్ జోగారావులను సత్కరించారు.

వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

వారికి న్యాయం జరిగేనా?

ప్రజాశక్తి - కవిటి

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశారు. అయితే నిబద్ధతతో పనిచేస్తూ లంచం ఇవ్వని కొందరు సిబ్బందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేసి డబ్బులు చెల్లించిన వారిని వారి స్థానాల్లో నియమించినట్టు తెలుస్తోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న చాలా మద్యం దుకాణాల్లో విద్యాధికులు పనిచేస్తున్నారు. వేరే ఉపాధి అవకాశాలు లేకపోవడం, కుటుంబ కార్యక్రమాలు నిర్వహించడం కష్టంగా మారడంతో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నారు. అయితే ఇటువంటి సందర్భాల్లో వారే ఎక్కువగా అన్యాయానికి గురవడం జరుగుతోంది. అందులో భాగంగా కవిటి మండలంలో డబ్బులు చెల్లించని పలువురిని వారు పనిచేస్తున్న దుకాణం నుంచి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం ఉన్న దుకాణాలకు బదిలీ చేశారు. డబ్బులు చెల్లిన వారిని పక్కపక్కనే ఉన్న దుకాణాల్లోకి పంపించారు. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బదిలీలకు డబ్బులు తీసుకోవడం పెద్ద చర్చనీయాంశం కాగా, ఇప్పుడు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న సమర్థులైన యువకులను అన్యాయంగా వేరే గ్రామాలకు బదిలీ పేరుతో పంపించడం వివాదాలకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే ముగ్గురు అధికారులపై వేటు పడడంతో సదరు సిబ్బంది తమకూ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంలో జరిగిన అక్రమాలు గుర్తించి తమకు ఎప్పటిలాగే స్థానికంగా అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నారు.

'ఆయుష్'కు పెరుగుతున్న ఆదరణ

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మంగమ్మ

ప్రజాశక్తి - బూర్జ

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుష్ ఆయుర్వేద ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. మూడేళ్లుగా వైద్యులు లేకపోవడం రోగులకు అవసరమైన మందులూ అందుబాటు లేవు. దీంత ఆయుష్ ఆస్పత్రి దాదాపుగా మూతపడే స్థితికి చేరుకుందని అందరూ భావించారు. అయితే ఈ ఆస్పత్రికి ఐదు నెలల క్రితం వైద్యాధికారి మంగమ్మ బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆదరణ పెరిగింది. ఈమె వారానికి మూడు రోజులు సోమ, బుధ, శుక్రవారాలు వైద్య కేంద్రాన్ని తెరిచి రోగులకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో మెల్లగా రోగులు రావడం ప్రారంభించారు. ముఖ్యంగా ఈ కేంద్రానికి దీర్ఘకాలికమైన వ్యాధులతోపాటు మోకాళ్ల నొప్పులు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల నివారణకు మండల ప్రజలు వస్తున్నారని మంగమ్మ తెలిపారు వీరి కోసం అవసరమైన మందులనూ సిద్ధం చేశామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నౌపడ : టెక్కలి విద్యుత్ కేంద్రంలో 132/33 కెవి మరమ్మతుల కారణంగా నౌపడ, సంతబొమ్మాళి సబ్‌స్టేషన్ పరిధిలో మండలవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇ ఎం.శివ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి ఇఇ జి.శంకరరావు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వినియోగదారులందరూ విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రంథాలయానికి మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థకు వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను బ్రహ్మాస్ అకాడమీ మంగళవారం అందజేసింది. ఈ పుస్తకాలు గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు చదివే వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు తెలిపారు. బ్రహ్మాస్ అకాడమీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ తాము వివిధ యూనివర్సిటీలో, డిగ్రీ కళాశాలలో అందజేస్తున్న వన్ రూపీ పర్ డే ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ గురించి అక్కడ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధులవుతున్న విద్యార్థులకు తెలియజేస్తున్నామని అన్నారు. బ్రహ్మాస్ అకాడమీ నేషనల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ తాము గ్రంథాలయానికి అందజేసిన పుస్తకాలు వారికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకులు విశంకలరరావు, రమణమూర్తి, చిరంజీవి పాల్గొన్నారు.

మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న సిబ్బంది

అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేపల పెంపకంతో ఉపాధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చేపల పిల్లలను ఎంపిక చేసుకోవడంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని, మూడు రకాల చేప పిల్లలను 2 మీటర్లలోతుండే చెరువులో ఎకరా నీటి విస్తీర్ణానికి 2 వేల వరకు వదలాలని మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు జువాలజీ విభాగం ఆధ్వర్యాన నగరంలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో చేపల పెంపకంపై మంగళవారం అవగాహన కల్పించారు. చేపలు, చెరువులు, భౌతిక, రసాయన పరీక్షల ప్రయోగాలను, చెరువులో దాణా నిర్వహణ, చేప పిల్లల నిల్వ, చెరువుల నిర్వహణ, చేపల పెంపకం, ఆధునిక పద్ధతులు, వ్యాధుల గుర్తింపు, నియంత్రణ, ప్రాసెసింగ్, చేపలు పట్టుకునే విధానం తదితర అంశాలపై వివరించారు. చేపలతో పాటుగా రొయ్యలు పెంచుకుంటే అధిక లాభాలను పొందవచ్చున్నారు. సేంద్రియ, రసాయన ఎరువుల్ని 15 రోజుల తేడాతో ఒకటి వేసుకున్నాక మరొకటి వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు సంతోష్‌కుమార్, ఎఫ్‌డీఓ కె గంగాధరరావు, ల్యాబ్ అసిస్టెంట్ పి వెంకట్ బాబు, దువ్వాడ ఈశ్వరరావు, కె గాయిత్రీ, అధ్యాపకులు ఐ హేమపద్మజ, డాక్టర్ వై రవికుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - నరసన్నపేట

మండలంలోని గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. తినే సమయానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ధరించే దుస్తులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి ఆహారం, నీటిని తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, ప్లేస్మెంట్ అధికారి మేరీరత్నం, హిస్టరీ అధ్యాపకులు పద్మనాభం పాల్గొన్నారు.

మోహనరావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని ఐకాన్ ప్రయివేటు ఆస్పత్రి ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఫిజియోథెరపిస్టు సీపాన హేమ మోహనరావుకు అజెక్టా విశ్వవిద్యాలయం నార్త్ అమెరికా నుంచి పిహెచ్‌డి పట్టాను అందుకున్నారు. ఆధునిక యుగంలో ప్రస్తుత మానవ జీవన విధానం వల్ల కలిగిన మానసిక ఒత్తిడిపైన, సంప్రదాయ ఔషధమైన నాచురోపతి, యోగాలో చేసిన పరిశోధనలో భాగంగా పిహెచ్‌డి పట్టాను ఈ నెల 25న శ్రీలంక దేశం కొలంబోలో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో ఇండియన్ డెలిగేటుగా పాల్గొని ఈ పట్టాను అందుకున్నారు.

డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న మోహనరావు

ఈ మేరకు కొలంబో యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మణ్ మధుర సింగే, డేమ్ డాక్టర్ హేథర్ వారెల్లా జాన్సన్, డేమ్ డాక్టర్ హస్పాసియా పెప్ప, ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ రౌత్ లు అందించారు. పట్టణ వైద్యునికి ఇటువంటి అరుదైన గౌరవం దక్కడంపై పలువురు అభినందనలు తెలిపారు.

ట్రోఫీని అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

దీపికకు అభినందనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కబడ్డీలో రాష్ట్రస్థాయిలో సిల్వర్ పతకం సాధించిన పెద్దపాడులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకులం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి మంగళవారం అభినందించారు. తిరుపతిలో ఈ నెల 24 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయిలో స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొన్నారు. పదో తరగతి చదువుతున్న ఎ.దీపిక ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.మాధవీలత, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.పుష్పవాణి, పిఇటి జయశ్రీ, వార్డెన్ హాఫీజ్ బేగం పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని బిర్లంగి సచివాలయం పరిధిలో జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, బాకీ లక్ష్మీనారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

కవిటి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కోరారు. మండలంలోని డి.జి.పుట్టుగలో జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి, పంచాయతీలో అందించిన సంక్షేమ పథకాల ఛార్టును విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం కిరణకుమారి, ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, ఎంపిటిసి పూర్ణచంద్రరావు, నాయకులు బెందాలం జయప్రకాష్, పుల్లట జగదీష్, జల్లు యుగంధర్, బదకల భాస్కరరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న సర్పంచ్ రత్నం బాలరాజు

వజ్రపుకొత్తూరు: జగనన్న అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా పరిషత్ వైస్‌చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని అమలపాడు సచివాలయం ఆవరణలో సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అధ్యక్షతన వై నీడ్ జగన్ ఎపి కార్యక్రమంలో పాల్గొన్నారు. పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధు కేశవ రావు, వైసిపి మండల అధ్యక్షుడు పుక్కల గురయ్యా నాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దున్న వీరాస్వామి, సర్పంచ్‌లు భాస్కరరావు, వరదరాజు, ఎంపిటిసి వెంకన్న, వైస్ సర్పంచ్ గిరి పాల్గొన్నారు.

మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

లింగ వివక్షతను నిర్మూలిద్దాం

జి.సిగడాం: లింగ వివక్షతకు ఇక ముగింపు పలుకుదామంటూ మండల మహిళా ప్రతినిధులు ఎపిఎం రెడ్డి రామకృష్ణనాయుడు పిలుపునిచ్చారు. లింగ వివక్షత జాతీయ వ్యతిరేక ప్రచారంలో భాగంగా మంగళవారం వెలుగు కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సమావేశాలు, ప్రతిజ్ఞలు, మానవహారాలు, ఇంటింటా అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులను అరికడదాం, లింగ వివక్షత నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.నిశ్చల మాట్లాడుతూ లింగ వివక్షత లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై లింగ వివక్షత చూపరాదని, మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలనూ చదివించి సమాజంలో ఎదుగనివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు వాన ప్రమీలవతి, గ్రామ సంఘ సభ్యులు, విఒ అధ్యక్షులు, హెల్త్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, సిసిలు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ మురళీమోహన్ కుమార్

చిగురువలస సచివాలయం తనిఖీ

సరుబుజ్జిలి : విధులను సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని ఎంపిడిఒ పి.వి.వి.మురళీమోహన్ కుమార్ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని చిగురువలస గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టుపురంలో భవిష్యత్‌కు గ్యారెంటీ

కోటబొమ్మాళి: మండలంలోని పట్టుపురంలో టిడిపి నాయకులు బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి రాగానూ చేపట్టబోయే పథకాలను వివరించారు. తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒకొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500లు, దీపం పేరుతో ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం వంటి పథకాలను అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టి సింహాచలం, బొడ్డపు రామారావు, బొడ్డపు శ్రీను పాల్గొన్నారు.

4 నుంచి శిక్షణ

మెళియాపుట్టి : వచ్చే నెల 4 నుంచి 9 వరకు ఆడుదాం ఆంధ్రాపై గ్రామ సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు శిక్షణ ఇస్తామని పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో 15 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులు టీమ్‌లుగా ఏర్పాలు చేస్తామని అన్నారు. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందని తెలిపారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలోని మండలాల్లో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఇఒ తిరుపతి పట్నాయక్, కార్యదర్శులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నైపుణ్యతను సాధించాలి

డాన్స్ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థీ నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, దీనికి తోడు నైపుణ్యత సాదించినప్పుడే ఉన్నతికి చేరుకోగలరని జనిత్ సాఫ్టువేర్ కంపెనీ అధినేత శాస్త్రి పుల్లెల సూచించారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షత మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాల విద్య ఎంతో కీలకమని అన్నారు. భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు సువర్ణావకాశమని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా చదవుకోవడం వల్లే అవకాశాలను అందిపుచ్చుకోగలరన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిగా ముఖ్య అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. తోటి పూర్వ విద్యార్థుల సహకారంతో కొన్ని కంప్యూటర్లను కళాశాలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్ వెల్ఫేర్ యూనియన్ కో-ఆర్డినేటర్, బయోటెక్నాలజీ విభాగ అధిపతి ఎం.ప్రదీప్ పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన అనేక నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ కళాశాల పరిపాలనాధికారి ఎన్.సూర్యప్రకాష్, ఎన్సిసి ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్. వై.పోలినాయుడు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులో తీసుకురావడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తరుపున 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, నర్తు శివాజీ, ఆర్.చిట్టిబాబు పాల్గొన్నారు. అనంతరం ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ పొయ్యి, సిలెండర్లను మహిళలు పంపిణీ చేశారు.

కిట్లను పంపిణీ చేస్తున్న సాయిరాజ్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

అవగాహన కల్పిస్తున్న తిరుపతిరావు

ప్రజాశక్తి- బూర్జ

ఉద్యానవన రైతులు జీడి మామిడి పంటల్లో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చునని హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ అధికారి తిరుపతిరావు తెలిపారు. మండలంలోని హడ్డుబంగి, మాసానుపుట్టి తదితర గ్రామాల్లో జీడి మామిడి రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి తోటలు చిగురు, పూత దశలో ఉందని, ఈ సమయంలో టీ దోమ, రసం పీల్చే పురుగులు ఎక్కువుగా వస్తాయని అన్నారు. టీ దోమ వల్ల జీడిపంట ఎండిపోవడం, మాడిపోవడం జరుగుతుందన్నారు దీనివల్ల దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రసం పీల్చే పురుగుల నివారణకు జీడి తోటల్లో మొనొక్రోతోపాస్ పిచికారీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు సూచనలు పాటించాలన్నారు. ఆయనతో పాటు హార్టికల్చర్ సిబ్బంది ఉన్నారు.

దూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ

వజ్రపుకొత్తూరు: దూడల పెంపకంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. పాత టెక్కలి పశు వైద్య కేంద్రం ఆవరణలో సర్పంచ్ తుంగాన సుశీల అధ్యక్షతన పాడి రైతులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. పాడి పశువుల పెంపకంలో మెళుకువలు రైతులకు తెలియజేశారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. పాడిని లాభసాటి వ్యాపారంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ జయరాజు, సహాయ సంచాలకులు మట్ట రవికృష్ణ, ఎంపిటిసి బాలక శ్రీను, వెటర్నరీ వైద్యులు రాజ్‌కిరణ్, ఇచ్ఛాపురం గణపతి పాల్గొన్నారు.

ఎల్ఎన్‌పేట : ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

పలువురికి ఆర్థికసాయం

ఎల్ఎన్‌పేట : మండలంలోని యంబారం గ్రామానికి చెందిన యాళ్ల కృష్ణ, గొట్టిపల్లికి చెందిన కూర్మాన సింహాచలం, కత్తల వరాలమ్మ అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, పారిశ్రామికవేత్త మామిడి గోవిందరావు మంగళవారం రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన మహాలక్ష్మి కేన్సర్‌తో బాధపడుతుంది. వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు స్పందించారు. ఈ మేరకు రూ.7 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వంక రాజు, మాజీ సర్పంచ్ గోసాల శంభూరావు, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఫౌండర్ విజయ్ కుమార్, ఇన్‌ఛార్జి బత్తిని కుమారస్వామి, రాహుల్, తిరుపతి, షణ్ముఖపండా, శ్రీధర్ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని డి.జి.పుట్టుగకు చెందిన బడియా బాలయ్య ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం అవసరమైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఎస్జిఎఫ్ సంస్థను సంప్రదించాడు. దీంతో గ్రామానికి చేరుకున్న సభ్యులు స్థానిక ఎంపిటిసి పూర్ణచంద్రరావు చేతులు మీదుగా బాధితుడికి రూ.5వేలతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. కరగాన లక్ష్మీనారాయణ, ఎస్జిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులు

ఉత్సాహంగా కరాటే పోటీలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలం లోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలో సోమవారం రాత్రి ఘనంగా ఫ్యామిలీ కోటర్స్ బ్రూస్లీ బర్తడే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు టైగర్ కరాటే అకాడమీ విద్యార్థుల ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పెన్ కార్డ్ సెల్ ఆర్ట్ ప్రెసిడెంట్ దయామయ మాస్టర్ పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులను అభినందిస్తూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల రోగాలను దూరం చేస్తుందన్నారు. కరాటే వల్ల ఏకాగ్రత, పట్టుదల, మెమరీ పవర్, సాహసం పెరుగుతుందని, ఆత్మరక్షణకు తోడ్పడుతుందని అన్నారు. తల్లిదండ్రులు చదువుతోపాటు కరాటే మార్షల్ ఆర్ట్స్ తదితర క్రీడలను ప్రోత్సాహించాలని అన్నారు. చిన్నారులు చిన్న వయసులోనే కరాటే మార్షల్ ఆర్ట్స్ క్రీడలు వల్ల మెంటల్ స్టామినా పెరుగుతుందన్నారు. కరాటే మానసిక వికాసానికి ఉల్లాసానికి, విద్యార్థినుల ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. టైగర్ కరాటే అకాడమీ మాస్టర్ సింక సంతోష్ కుమార్ మాట్లాడుతూ టైగర్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ 40 మంది విద్యార్థులు వివిధ రకాల బెల్టులు, ధ్రువపత్రాలు పొంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ క్వార్టర్స్ పెద్దలు మహేష్, రామకృష్ణ, పంచాయతీ పెద్దసింక రామారావు, ముసలయ్య, శేఖర్, శ్రీరాములు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కనబరచాలని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడభద్ర పాఠశాల విద్యార్థులకు క్రీడా కిట్లు, వంట పాత్రలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతి పాఠశాలలోనూ నాడు-నేడు కింద అభివృద్ధి చేశారని అన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరిగిందన్నారు. విద్యాభ్యాసనతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించిన క్రీడా కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు దిలీప్‌కుమార్ సాహు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతులు

రైతులను ఆదుకోవాలి

పర్లాకిమిడి : అనావృష్టితో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి బాలచంద్ర సడంగి, రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాణిగ్రహి, రాష్ట్ర అధ్యక్షులు జమేశ్వర్ సామంతరాయ్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ అసెంబ్లీ సమీపంలో వివిధ శ్రామిక, కర్షక ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ ప్రకారం రైతుల పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలన్నారు. కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు పండిస్తున్న పంటలన్నింటికీ నీటిపారుదల సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్, భారత కిసాన్ మజ్ దూర్ సభ, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ సెంటర్, పశ్చిమ ఒడిశా రైతు కూలి సంఘం, ఛాసి మూల్య సంఘం, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.